## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడిగా కాకర్ల


కాకర్ల వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షుడిగా పోచవరం గ్రామానికి చెందిన కాకర్ల వెంకటేశ్వరరావు రెండో సారి నియమితులయ్యారు. హోం మంత్రి తానేటి వనిత ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీని నియమించామని కాకర్ల వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. అధ్యక్షుడిగా కాకర్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కొలుకుల సత్యనారాయణ, తొంట రామకృష్ణ, కోశాధికారిగా దుగ్గిరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా మారిశెట్టి గణేష్, అయినపర్తి సందీప్, బండ్రెడ్డి సత్యనారాయణ, కార్యదర్శులుగా నరాలశెట్టి వెంకటేశ్వరరావు, పిట్టా తమ్మారావు, బందుల తుర్గారావు, ఎలిపే రాజు, అనపర్తి సత్యనారాయణ, కొప్పాక గోపి ఎంపికయ్యారు. అలాగే మరో 16 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

### 50 వేల గోనె సంచులు సిద్ధం


గోపాలపురం మండలం కోమటికుంట రైసు మిల్లుకు చేరిన గోనె సంచుల లారీ

గోపాలపురం: రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ధాన్యం పట్టుబడి కోసం సోమవారం 50 వేల గోనె సంచులు మండలంలోని కోమటికుంట మాతంగమ్మ రైసు మిల్లు వద్దకు చేరాయని ఆయన చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లి, గోపాలపురం రైసు మిల్లుల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంటాయన్నారు. కావాల్సిన మండలంలోని రైతులు ఆ మిల్లుల వద్ద నుంచి సంచులను తీసుకెళ్లాలని సూచించారు. సంచులు, హమాలీ, రవాణా ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

### పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెంకటరమణను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజారావు, మండల కమిటీ సభ్యులు అభినందించారు.

### నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెరవలి: విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని ఖండవల్లి ఫీడర్ పరిధిలో మంగళవారం సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఆ శాఖ డీఈ బి.వీరభద్రరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లాకులవారిపాలెం, కాపవరం, ఖండవల్లి, లంకమాలపల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాలకు మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

### ఆశ్రమం నిర్మాణానికి చిన్నారుల విరాళం


విరాళం అందిస్తున్న విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం

నల్లజర్ల: వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమానికి విద్యార్థులు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు గ్రామంలోని ఎకరం విస్తీర్ణంలో రూ.4 కోట్ల వ్యయంతో వృద్ధులు, అనాథ పిల్లల కోసం ఆశ్రమం (ఆనంద నిలయం) నిర్మాణం చేపట్టారు. మానవత సంస్థ, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆశ్రమానికి నల్లజర్ల మండలం తెలికిచెర్లలోని ఎస్‌కేఎస్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25217 సేకరించి సోమవారం విరాళంగా అందజేశారు. ఆశ్రమ నిర్మాణ కమిటీ సభ్యులైన గుణ్ణం బుల్లెబ్బాయి, సలాది ప్రకాష్‌లకు ఈ మొత్తాన్ని అందజేసినట్టు ఆ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ చీమకుర్తి వీరవెంకట సత్యనారాయణ తెలిపారు.

### 45 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్టు

దేవరపల్లి: నల్లజర్ల మండలం అనంతపల్లిలో సోమవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. సారా విక్రయిస్తున్న కొయ్యలగూడెం మండలం రాజవరానికి చెందిన వేముల దుర్గారావు, గంగవరానికి చెందిన కొడాలి జయరాజు, అనంతపల్లికి చెందిన వెలగన చంద్రం అనే ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.

# పేదలకూ కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యంగా..

- వైద్య, ఆరోగ్య రంగంలో సమూల మార్పులు
- హోం మంత్రి తానేటి వనిత
- డివిజన్ వ్యాప్తంగా సురక్ష వైద్య శిబిరాలు


కొవ్వూరు మండలం దొమ్మేరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత


దేవరపల్లి మండలం గౌరీపట్నంలో రోగులకు మందులు అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమూల సంస్కరణలు తీసుకు వచ్చారని హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. మండలంలోని దొమ్మేరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరు గురించి శిబిరానికి వచ్చిన రోగుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వనిత పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో 526 మందికి వైద్య నిపుణులు రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. రోగులకు మందులు కిట్లను మంత్రి అందించారు. అలాగే కొవ్వూరు పట్టణ పరిధిలోని ఔరంగాబాద్‌లోనూ సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.అర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్‌లతో పాటు పలువురు వైద్యులు రోగులకు సేవలందించారు. ఎమ్మెల్సీ కొరు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గారపాటి వెంకటకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు వాడవెల్లి సూరిబాబు, సర్పంచ్ తానేటి కుమారి, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

**మల్లవరంలో 456 మందికి..**

చాగల్లు: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల వద్దకే వైద్య సేవలను అందిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మల్లవరం గ్రామంలోని కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. వైద్య సేవల అందుతున్న తీరును మంత్రి పరిశీలించారు. శిబిరంలో 456 మందికి వైద్య నిపుణులు రోగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు మార్కొండపాడు పీహెచ్‌సీ వైద్యుడు టి.అరుణ్‌రాయ్ తెలిపారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు చేశామని చెప్పారు. రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, మల్లవరం సర్పంచ్ కోడూరి లక్ష్మీసుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

**గౌరీపట్నంలో 535 మందికి..**

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాయి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ శిబిరంలో 535 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 17 మందిని ఉన్నత వైద్యం కోసం ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 67 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డులను ఎమ్మెల్యే తలారి పరిశీలించి, రోగులకు మందులు అందజేశారు. ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. శిబిరంలో డాక్టర్లు వై.సుజన, సీహెచ్ హరిశ్చంద్ర, ఎస్.శ్రావణి, పి.సాయితేజస్వి, వైస్ సర్పంచ్ ఆండ్రు రమేష్‌బాబు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, మండల ప్రత్యేకాధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పడమర చోడవరంలో 466 మందికి..**

నల్లజర్ల: మండలంలోని పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని పడమర చోడవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గుండేపల్లి సర్పంచ్ కలం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు జంగా లక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్రామానికి వచ్చి శిబిరాన్ని పర్యవేక్షించారు. వైద్యులు కళ్యాణ్, తేజశ్రీ, వెంకట్రావు, సిరాజుద్దీన్‌లు 466 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారిలో 13 మందిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ఎంపీడీఓ రాజశేఖర్, తహసీల్దార్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**లంకమాలపల్లిలో 405 మందికి..**

పెరవలి: మండలంలోని లంకమాలపల్లిలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 405 మంది రోగులకు వైద్య నిపుణులు వివిధ రకాల పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో మెరుగైన చికిత్సల నిమిత్తం వారిలో 31 మందిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని స్థానిక వైద్యుడు ఏహెచ్ విజయ్ కుమార్ తెలిపారు. శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణులు ప్రత్యూష, సాయి సంజన, జాన్ మిల్టన్, హేమరాజు సేవలు అందించారు. ఈ శిబిరానికి హాజరైన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిదండి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు కుసుమే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా జగన్ పాలన

- హోం మంత్రి తానేటి వనిత
- గౌరిపల్లిలో హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం


హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని గౌరిపల్లిలో రూ.17.5 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాన్ని సోమవారం మంత్రి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా గౌరిపల్లి గ్రామభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ తాళ్లూరి హైమావతి, సత్యనారాయణ దంపతులను మంత్రి తానేటి వనిత పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ నాయకుడు లకంసాని సూర్యప్రకాశరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి సోమరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రామాణికంగా పేదలకు పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు సచివాలయం– 3 పరిధిలో గడప గడపకూ..


మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత. చిత్రంలో నాయకులు

చాగల్లు: అర్హత ఒక్కటే ప్రామాణికంగా రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు సచివాలయం–3 పరిధిలో సోమవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలసి మంత్రి ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వృద్ధులు, అక్కచెల్లెమ్మలు, యువత, చిన్నారులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. గ్రామస్తులు వనితకు అడుగడుగునా హారతులు పట్టారు. పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నా, అర్హులై ఉండి కూడా ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. పలువురు తన దృష్టికి తీసుకు వచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష ,అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి, ఉప సర్పంచ్ మేకా రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం


మలకపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మండలంలోని మలకపల్లి గ్రామంలో రెండో రోజు సోమవారం కూడా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వనితమ్మను గెలిపించుకుందాం, జగనన్నను మళ్లీ సీఎంను చేద్దాం అంటూ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించే కర పత్రాలను గ్రామస్తులకు అందజేశారు. ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు పూడి వరలక్ష్మి, సూదిన అనిత పద్మ, పార్టీ నాయకులు గెడ్డం సూర్యారావు, సూదిన సూరిబాబు, పూడి బుచ్చియ్య, అబ్బులు, మూతిన చిరంజీవి, గద్దె ప్రభాకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశేష అలంకరణలో కోటసత్తెమ్మ


కోటసత్తెమ్మవారి అలంకారం


కోట సత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో సహస్ర నామ కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

నిడదవోలు రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల రెండో రోజైన సోమవారం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వారందరూ అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 226 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. వివిధ రూపాల్లో అమ్మవారికి రూ.90,142 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. అలాగే సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ ఆలయ వద్ద మహిళలు భజనలు, కుంకుమ పూజలు చేశారు. లోహియా నగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సహిత రాజరాజేశ్వరిస్వామి ఆలయాల్లోనూ అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సింగవరంలో ముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

# శక్తి స్వరూపిణి.. ముక్తి దాయిని

- శోభాయమానంగా శరన్నవరాత్రులు
- అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు
- మండపాల వద్ద భక్తులు, భవానీ మాలధారుల రద్దీ


తాళ్లపూడిలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు


గాయత్రీదేవిగా దేవరపల్లిలోని బాలదుర్గమ్మ


బాలాత్రిపుర సుందరిగా మోర్తలోని కనకదుర్గమ్మ


అనంతపల్లి స్వర్ణ దుర్గాశ్రమంలోని స్వర్ణ దుర్గాదేవి

తాళ్లపూడి: జగన్మాత సేవలో భక్తులు పునీతులవుతున్నారు. శరన్నవరాత్ర వేడుకలు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా శోభాయమానంగా జరుగుతున్నాయి. తాళ్లపూడిలోని నవదుర్గా.శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ వారిని సోమవారం గాయత్రీ దేవిగా అలంకరించారు.అర్చకుడు అల్లూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పల్లకీ సేవ, పవళింపు సేవ నిర్వహించారు. అలాగే స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీ దేవి ఆలయం వద్ద పూజలు జరిగాయి.

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై కొలువైన కనకదుర్గమ్మ వారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. అలాగే స్థానిక మహాలక్ష్మమ్మ ఆలయంలోనూ కుంకుమ పూజలు జరిగాయి. ధనలక్ష్మి అమ్మవారిని తామర పుష్పాలతో అలంకరించారు. మీనానగరంలోని ముత్యాలదిబ్బ వద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు చేశారు. బ్రాహ్మణగూడెం గ్రామదేవత నాగారమ్మ వారి ఆలయంలో భక్తులు భజన చేశారు. అమ్మవారిని సుందరంగా అలంకరించారు. రావుల చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరపల్లి: స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవి, బాలదుర్గమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మోర్తలో కొలువైన విజయ కనకదుర్గమ్మ, పాలంగిలోని కనకదుర్గమ్మ, చిలకపాడు గ్రామంలోని దుర్గమ్మ వార్లు సోమవారం బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల వద్ద అమ్మవారికి భవానీ మాలధారులు పూజలు నిర్వహించి అనంతరం భిక్షలో పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీదేవీ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజ, లలితా పారాయణం చేశారు. ఆకెళ్ల శ్రీనివాసు, దోనేపూడి సుధాకర్, సత్యకృష్ణ, కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పెరవలి: ఖండవల్లి, పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల్లోని దుర్గామాత ఆలయాలు, మండపాల వద్ద వేకువజాము నుంచే కుంకుమార్చలు జరిగాయి. ఖండవల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద వందలాది మంది భక్తులు పూజలు చేశారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల అమ్మవారి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వెంకట్రాయపురంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ ప్రతిమ విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని పోలి ఉంది.


చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలో మహిళల కుంకుమ పూజలు

నల్లజర్ల: అనంతపల్లిలోని స్వర్ణ దుర్గాశ్రమంలో అమ్మవారికి కరుటూరి రాజారావు, స్వరాజ్యలక్ష్మి దంపతులు కుంకుమ పూజలు చేశారు. అన్న సమారాధన జరిగింది. హరినామ సంకీర్తన చేశారు. నల్లజర్లలోని వనదుర్గ ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. పోతవరంలోని కామాక్షి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. తూర్పుచోడవరం, కవులూరు, దూబచర్ల గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలలో పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

# కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

- ప్రతి గింజనూ ప్రభుత్వమే సేకరిస్తుంది
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గౌరీపట్నం, దేవరపల్లిలలో కేంద్రాల ప్రారంభం


దేవరపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గౌరీపట్నం, దేవరపల్లి రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రాల వద్దకు రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని ఎమ్మెల్యే తలారి తూకం వేసి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తాను పండించిన ధాన్యాన్ని ఈ కేంద్రాల్లో అమ్ముకుని గిట్టుబాటు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన 21 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుందన్నారు. గోనె సంచులు, ఎగుమతి దిగుమతి ఖర్చులతో పాటు రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.నియోజకవర్గంలో 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, గుత్తికొండ అచ్యుతరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, సర్పంచులు కడిమి వీరకుమారి, రాయి అన్నపూర్ణ, ఏవో కె. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపల్లిలో..**

నల్లజర్ల: రైతులు ఎక్కడా మోసపోకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని అనంతపల్లి సొసైటీ గొడౌన్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, వ్యవసాయాధికారి కమల్‌రాజ్, సొసైటీ కార్యదర్శి శర్మ, సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, కారుమంచి రమేష్, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, తాడిగడప శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**అన్ని ఆర్బీకేల వద్దా కొనుగోలు కేంద్రాలు**

చాగల్లు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్దా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించామని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ తెలిపారు. చాగల్లు రైతుభరోసా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్వింటాల్‌కు ధాన్యం సాధారణ రకానికి రూ.2183, గ్రేడ్– ఎ రకానికి రూ.2203 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులందరూ ధాన్యంలో తేమ శాతం 17 శాతానికి లోపు ఉండేలా చూసుకోవాలన్నారు. తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ధాన్యం పట్టుబడి కోసం అన్ని రైతుభరోసా కేంద్రాల్లోనూ గోనె సంచులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఏవో కె. వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే మండల స్థాయి ఫిర్యాదుల విభాగం నంబర్–93908 93113 కు గాని డివిజన్ స్థాయి నంబర్–83094 87151 కు గాని ఫోన్ చేయవచ్చన్నారు.

## ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించిన బోర్డు మెంబర్

కొవ్వూరు: పట్టణంలోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న వివిధ పరిశోధనల ప్రగతి గురించి ఆయన శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. టిష్యూ కల్చర్ మొక్కల పెంపకం, ల్యాబ్‌లు, ప్రత్యేకతల గురించి తెలుసుకున్నారు. అరటి, దుంప పంటలపై కొనసాగుతున్న పరిశోధనలు, కొత్త వంగడాల గురించి ఆయన ఆరా తీశారు. పంటల సాగును స్వయంగా పరిశీలించారు. ఈ పరిశోధనా స్థానం నుంచి అరటిలో కూర రకం కొవ్వూరు బొంత, గోదావరి బొంత మంచి ఆదరణ పొందాయని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి జి.రామానందం వివరించారు. కందలో గజేంద్ర అనే తీపి రకం మంచి ప్రాచుర్యం పొందిందన్నారు. చేమలో శతముఖి, గోదావరి చేమ ఆదరణ పొందాయని వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్ర కుమార్, సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ల విభాగం) ఎ.స్నేహలతారాణి, ఉద్యాన శాస్త్రవేత్త ఎం.విశ్వనాథ్, యాళ్ల చిన్న, కూడుపూడి విష్ణు పాల్గొన్నారు.

### క్రైస్తవుల సమస్యలపై యాప్ ఏర్పాటుకు సీఎం హామీ

దేవరపల్లి: క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యాప్ ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ పందూ ప్రేమ్‌కుమార్ తెలిపారు. దేవరపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం పిలుపు మేరకు తాడేపల్లిలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాను మర్యాద పూర్వకంగా కలిశానని ప్రేమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, శ్మశానవాటికలు, చర్చిల అభివృద్ధి వంటి పలు సమస్యలను సీఎంకు వివరించానన్నారు.

### డిగ్రీ కళాశాలలో ఆహార భద్రతా దినోత్సవం

కొవ్వూరు: ఆహార భద్రత ప్రాముఖ్యతపై ప్రతి విద్యార్థీ అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్పత్తిలోను, రవాణాలోను, ఆహారం వినియోగంలోను వృథాను అరికట్టాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వృక్ష శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.